# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 31 | గురువారం 02, అక్టోబర్ 2025 | పేజీలు: 07 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com




జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపికపై

## సీఎం సమీక్ష

హైదరాబాద్, ప్రజాస్వరం

జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. దీనిపై నివేదిక ఇవ్వాలని ముగ్గురు మంత్రులకు ఆయన సూచించారు. తాజా రాజకీయ పరిస్థితులను వివరిస్తూ.. నివేదికలో అభ్యర్థుల పేర్లు, వివరాలు ఉండాలని పేర్కొన్నారు. గెలుపు మిగతా 2లో..



## కేసీఆర్ పాలన రైతులకు స్వర్ణయుగం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ప్రజాస్వరం

తెలంగాణలో 2014 నుంచి పదేళ్ల కాలంలో రైతుల బలవన్మరణాలు తగ్గాయన్న జాతీయ నేర గణాంక విభాగం నివేదికపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తన అధికారిక మిగతా 2లో..



# మూసీ.. తొలిదశ సుందరీకరణకు ₹5,641 కోట్లు

మూసీ సుందరీకరణ నమూనా చిత్రం

నది సమగ్రాభివృద్ధి పనులకు త్వరలో శ్రీకారం

తొలి దశలో 20.5 కి.మీ. సుందరీకరణకు రూ.5,641 కోట్ల వ్యయం

ఫేజ్–1ఏలో హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.5 కి.మీ. అభివృద్ధి

ఫేజ్–1బీలో ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11 కి.మీ. సుందరీకరణ

ఘన, జల వ్యర్థాల నుంచి విముక్తి..

2 మీటర్ల లోతు వరకు పూడికతీత

హైదరాబాద్, ప్రజాస్వరం:

మూసీ సుందరీకరణ దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇటీవలే ఫ్యూచర్ సిటీ అభివృద్ధి పనులను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి.. త్వరలోనే మూసీ సమగ్రాభివృద్ధి పనులకు సైతం శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకోసం మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంఆర్‌డీసీఎల్) అధికారులు కసరత్తు చేస్తున్నారు. హైదరాబాద్‌లో మూసీ 55 కి.మీ. మేర ప్రవహిస్తుండగా..తొలి దశలో 20.5 కి.మీ. మేర నదిని పునరుజ్జీవింప చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించిన సంగతి తెలిసిందే. జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, గండిపేటల నుంచి బాపూఘాట్ వరకు రూ.5,641 కోట్ల వ్యయంతో మూసీ నది సుందరీకరణ చేపట్టనున్నారు.

**మాస్టర్ ప్లాన్ రెడీ!**

తొలి దశ మూసీ అభివృద్ధి పనుల కోసం రుణం మంజూరు చేసేందుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) సుముఖత వ్యక్తం చేయడంతో.. రాష్ట్ర ప్రభుత్వం మూసీ నదీతీర అభివృద్ధి పనులను వేగవంతం చేసింది. ఇందుకోసం ఏర్పాటైన కన్సల్టెన్సీ సంస్థ ఇప్పటికే సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలిసింది. తొలి దశలో 20.5 కి.మీ. అభివృద్ధి చేసేందుకు రూ.5,641 కోట్ల వ్యయాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. ఫేజ్-1ను రెండు సబ్ ఫేజ్‌లుగా విభజించిన అధికారులు ఫేజ్-1ఏలో మిగతా 2లో..

అసత్యంపై ఆర్ఎస్ఎస్

# పోరాటం

దేశ సంస్కృతిని కాపాడుతోంది

నిషేధం విధించినా నిలబడింది

దేశ కరెన్సీపై భరత మాత .. ఇదే తొలిసారి

ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకల్లో ప్రధాని మోడీ

హైదరాబాద్, ప్రజాస్వరం

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటుంది. ఢిల్లీలోని బీఆర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరుగుతున్న ఈ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఈసందర్భంగా రూ.100 నాణెం, పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు. అనంతరం మోడీ మాట్లాడుతూ.. శతాబ్ది ఉత్సవాలు జరుపుకొంటున్న ఆర్ఎస్ఎస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు ఆర్ఎస్ఎస్ కృషి చేస్తోందన్నారు. అసత్యంపై సత్యం, అన్యాయంపై న్యాయం, అధర్మంపై ధర్మం గెలుస్తుందన్నారు. 'నది తన ప్రవాహంతో అనేక భూముల్లో పచ్చదనం పెంచుతుంది. నదీ ప్రవాహంలా ఆర్ఎస్ఎస్ కూడా ప్రజలకు సేవ చేస్తోంది. విద్య, మిగతా 2లో..



మావోయిస్టులు జనజీవన స్రవంతిలో

# కలవాల్సిందే

వారికి మరో ఆప్షన్ లేదు

సాయుధ పోరాటంతో ఏం సాధించలేరు

డీజీపీ శివధర్ రెడ్డి.. పోలీస్ బాస్ బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, ప్రజాస్వరం

రాష్ట్రంలో పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరగా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరతామని నూతన డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. నూతన డీజీపీగా ఆయన లక్డీకపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. మాకు బలమైన జట్టు ఉంది. క్షేత్రస్థాయిలో సాంకేతికతను వినియోగించుకుంటాం. పోరాట మార్గం వీడేందుకు సిద్ధమని ఇటీవల నక్సల్స్ నేత లేఖ రాశారు. జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని వారిని కోరుతున్నాం. మావోయిస్టుల సిద్ధాంతాలు ఆచరణలో మిగతా 2లో..



# బీఆర్ఎస్‌తో నాకు సంబంధం లేదు

బీసీ రిజర్వేషన్ల బిల్లుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్న కవిత

రెండు నెలలు ఆగి ఎన్నికలు పెడితే వచ్చే నష్టమేంటని ప్రశ్న

కోర్టులను ఈటల తప్పుదోవ పట్టిస్తున్నారని కవిత విమర్శ

హైదరాబాద్, ప్రజాస్వరం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసమే తమ పోరాటమని ఆమె స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఈరోజు ఆమె మీడియాతో మాట్లాడుతూ... బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందే వరకు కేవలం మిగతా 2లో..

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

పండుగ సీజన్‌లో 3 శాతం డీఏ పెంపు

2025 జులై 1 నుంచే కొత్త డీఏ వర్తింపు

డీఏ 55 శాతం నుంచి 58 శాతానికి పెరుగుదల

ఉద్యోగులు, పెన్షనర్లకు చేకూరనున్న లబ్ధి

త్వరలోనే కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం!



హైదరాబాద్, ప్రజాస్వరం

పండుగల సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త అందే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉద్యోగులకు చెల్లించే కరవు భత్యం (డీఏ)ను మరో మూడు శాతం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీనిపై కేంద్ర కేబినెట్ మిగతా 2లో..



# డిఫెన్స్ లో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

అందుకనుగుణంగా అంతా పనిచేయాలి

దేశానికి భద్రతా అవసరాలు పెరిగిపోయాయి

కేంద్రరక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

హైదరాబాద్, ప్రజాస్వరం

భారతదేశ రక్షణరంగంలో పరిశోధన, అభివృద్ధిని బలోపేతం చేయడానికి ఒక వినూత్న పర్యావరణ వ్యవస్థను పెంపొందించనున్నట్లు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. డిఫెన్స్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ 278వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత మిగతా 2లో..

# జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపికపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

మొదటిపేజీ తరువాయి



గుర్రాన్ని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నిల బెట్టాలన్న కోణంలోనే నివేదిక ఉండాలని సీఎం పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికశాతం స్థానాలను కైవసం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ అంశంలో ఇన్‌ఛార్జ్ మంత్రులతోపాటు ఎంపీల భాగస్వామ్యంతో వెళ్లాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా సమావేశమై ఈ అంశంపై చర్చించారు.

# కేసీఆర్ పాలన రైతులకు స్వర్ణయుగం

మొదటిపేజీ తరువాయి



సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ ద్వారా స్పందన తెలియజేశారు. కేసీఆర్ రైతుబంధు పాలన రైతులకు స్వర్ణయుగమనే విషయం మరోమారు రుజువైందని ఆయన పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టులవల్ల 2014 నుంచి 2023 మధ్య తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. 2014లో తెలంగాణలో రైతులు, కౌలుదారులు, రైతు కూలీల ఆత్మహత్యల సంఖ్య 1,347గా ఉన్నదని, అదే 2023లో ఆ ఆత్మహత్యల సంఖ్య 56కు తగ్గిందని కేటీఆర్ చెప్పారు. అంటే 96 శాతం తగ్గుదల నమోదైందని అన్నారు. దేశంలోని రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ వాటా 2014లో 10.9 శాతం ఉంటే.. 2023 నాటికి అది 0.51 శాతం తగ్గిందని తెలిపారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పరిస్థితి తారుమారైందని విమర్శించారు. రెండేళ్లలోనే 700 మందికిపైగా అన్నదాతల ఆత్మహత్యలు నమోదయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు.



# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

మొదటిపేజీ తరువాయి

త్వరలోనే తుది నిర్ణయం తీసుకుని, అధికారిక ప్రకటన విడుదల చేయనుంది. ఈ పెంపునకు కేబినెట్ ఆమోదముద్ర వేస్తే, మొత్తం డీఏ 55 శాతం నుంచి 58 శాతానికి చేరుకుంటుంది. ఈ ఏడాది డీఏను పెంచడం ఇది రెండోసారి కావడం గమనార్హం. మార్చి నెలలో ప్రభుత్వం ఇప్పటికే 2 శాతం డీఏను పెంచింది. తాజా పెంపు నిర్ణయాన్ని ఈ ఏడాది జులై 1 నుంచే వర్తింపజేయనున్నారు. దీంతో ఉద్యోగులకు మూడు నెలల బకాయిలు కూడా అందనున్నాయి. సాధారణంగా, వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా ప్రభుత్వం ఏటా రెండు సార్లు డీఏను సవరిస్తుంటుంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం నుంచి ఉద్యోగులకు ఉపశమనం కల్పించేందుకు ఈ భత్యాన్ని అందిస్తారు. తాజా పెంపు వల్ల లక్షలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థికంగా లబ్ధి చేకూరనుంది. ఉదాహరణకు, రూ.60,000 ప్రాథమిక వేతనం (బేసిక్ పే) ఉన్న ఉద్యోగికి ప్రస్తుతం డీఏ రూపంలో రూ.33,000 అందుతుండగా, కొత్త పెంపు తర్వాత అది రూ.34,800కి పెరుగుతుంది. ఇదిలా ఉండగా, ఉద్యోగుల వేతన సవరణ కోసం ప్రభుత్వం 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ కమిషన్ సిఫార్సుల మేరకు భవిష్యత్తులో జీతాలు, ఇతర అలవెన్సులపై స్పష్టత రానుంది. 2026 జనవరి 1 నుంచి కొత్త వేతన సంఘం సిఫార్సులు అమల్లోకి వచ్చాక, ప్రస్తుత డీఏను బేసిక్ పేలో విలీనం చేసి సున్నాకు రీసెట్ చేసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఎస్సై ఎగ్జామ్ పేపర్ లీకేజీ గుట్టు రట్టు

- **రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ 117 మంది..!**

హైదరాబాద్, ప్రజాస్వరం

ఒడిశా స్టేట్ ఎస్సై ఎగ్జామ్ పేపర్ లీకేజీ గుట్టు రట్టయింది. ఒడిశాఆంధ్రప్రదేశ్ సరిహద్దు సమీపంలో మూడు స్లీపర్ బస్సులలో లీక్ అయిన ప్రశ్నపత్రాను తీసుకెళ్తున్న ఒడిశా సబ్‌ఇన్స్పెక్టర్ పరీక్ష అభ్యర్థులతో సహా 117 మందిని పోలీసులు అరెస్టు చేశారు. లీకైన పేపర్‌ను విజయనగరంలో తీసుకోవడానికి వెళ్తున్న 114 మంది అభ్యర్థులు, ముగ్గురు ఏజెంట్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మూడు బస్సుల్లో వెళ్తున్నట్లు ఒరిస్సా పోలీసులు సమాచారం అందింది. దీంతో ఎచ్చర్ల వద్ద మూడు బస్సులను తనిఖీ చేసిన శ్రీకాకుళం పోలీసులు వారిని పట్టుకున్నారు. నిందితులను ఒరిశా పోలీసులకు అప్పగించారు. ఒక్కో అభ్యర్థి నుంచి రూ. 25 లక్షలు డీలింగ్ కుదిరినట్లు సమాచారం. రూ.10 లక్షలు ముందుగానే చెల్లించాలి. ఉద్యోగం పొందిన తర్వాత మిగిలిన రూ.15 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని ఒప్పందం కుదిరింది.పోలీసుల కథనం ప్రకారం.. బెర్హంపూర్ పోలీసు బృందానికి రహస్య సమాచారం అందింది. ఒడిశాఆంధ్రప్రదేశ్ సరిహద్దు సమీపంలో మూడు ఏసీ స్లీపర్ బస్సులను అడ్డగించారు. భువనేశ్వర్‌లోని బారాముండా బస్టాండ్ నుంచి బయలుదేరిన ఈ బస్సుల్లో 117 మంది ప్రయాణికులు ఉన్నారు. విచారణలో వారిలో 114 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్ పరీక్షకు అభ్యర్థులు అని, భారీ నెట్‌వర్క్ కలిగిన ముగ్గురు ఏజెంట్ల సహాయంతో ప్రయాణిస్తున్నారని వెల్లడైంది. వాస్తవానికి.. అభ్యర్థులు పరీక్షకు హాజరు కావడానికి భువనేశ్వర్ తిరిగి వచ్చే ముందు విజయనగరంలో రహస్య ప్రశ్నాపత్రాలను పొందేందుకు కుట్ర పన్నారు.

# మూసీ.. తొలిదశ సుదరీకరణకు రూ.5641 కోట్లు

మొదటిపేజీ తరువాయి

హిమాయత్‌సాగర్ టు బాపూఘాట్ వరకు 9.5 కి.మీ, ఫేజ్-1బీలో ఉస్మాన్‌సాగర్ టు బాపూఘాట్ వరకు 11 కి.మీ. అభివృద్ధి చేయనున్నారు. ఫేజ్-1ఏ కింద రూ.2,500 కోట్లు, ఫేజ్-1బీ కింద రూ.3,141 కోట్లు వ్యయమవుతుందని అధికారులు అంచనా వేశారు. అంచనా వ్యయంలో రూ.4,100 కోట్లు ఏడీబీ నుంచి రుణం రూపంలో పొందనుండగా.. మిగతా నిధులను రాష్ట్ర ప్రభుత్వమే సమకూర్చుకోనుంది.

**493 ఎకరాలు అవసరం**

మూసీ తొలి దశ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వానికి 493 ఎకరాల (199.89 హెక్టార్లు) భూమి అవసరమని అధికారులు గుర్తించారు. ఇందులో 340 ఎకరాలు (137.72 హెక్టార్లు) పట్టా భూములు కాగా.. మిగిలిన 153 ఎకరాలు (62.17 హెక్టార్లు) ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్నాయి. భూ సేకరణ, పునరావాసం, నాణ్యమైన పరిహారం, పారదర్శకత హక్కు చట్టం (ఆర్‌ఎఫ్‌సీటీఎల్‌ఏఆర్‌ఆర్)-2013 కింద భూ సేకరణ చేపట్టనున్నారు. సేకరించే భూమిలో మూసీ చుట్టూ గ్రీన్ బెల్ట్ కోసమే సుమారు 270 ఎకరాలు (109.42 హెక్టార్లు) కేటాయించనున్నారు.



**ఇరువైపులా రిటైనింగ్ వాల్‌లు**

మూసీకి పునరుజ్జీవం కల్పించాలంటే తొలుత ఘన, జల వ్యర్థాలతో నిండిపోయిన నదిని శుభ్రం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు నదిలో 2 మీటర్ల లోతు వరకు వ్యర్థాలు, పూడిక తీయనున్నారు. నదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్‌లను నిర్మిస్తారు. ఆ తర్వాత నదిలోకి గోదావరి జలాలను వదులుతారు. ఈ నీళ్లు 24/7 ఉండేలా చూస్తూ గండిపేట నుంచి బాపూఘాట్ వరకు బోటింగ్ సౌకర్యాన్ని కల్పించనున్నారు. నది సరిహద్దుల నుంచి 20 మీటర్ల వెడల్పు వరకు గ్రీన్ బెల్ట్ ఉంటుంది. ఇందులో గ్రీనరీ పెంపకంతో పాటు వాక్ వేలు, సైక్లింగ్ ట్రాక్‌లు, భూగర్భ జలాల రీచార్జ్ కోసం పార్కులు, వర్షపు తోటలు, గ్రీన్‌రూఫ్‌లు, బ్యాటరీతో నడిచే వాహనాలు, ఎలక్ట్రిక్ రిక్షాలు వంటివి ఉంటాయి.

**వరదల నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థ**

నదికి ఇరువైపులా 50 మీటర్లు బఫర్ జోన్‌గా అధికారులు నిర్ణయించారు. ఈ ప్రాంతాన్ని కూడా ప్రాజెక్టులో అంతర్భాగంగా అభివృద్ధి చేస్తారు. మరోవైపు మూసీ వరదలను నియంత్రించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. బఫర్ జోన్‌లో వరద నియంత్రణ కాల్వలు, నాలాలు, పంపింగ్ స్టేషన్లు, వరద నియంత్రణ గోడలు, వరద పర్యవేక్షణ భవనాలు, వరద నిరోధక డెక్‌ల వంటి పటిష్టమైన మౌలిక సదుపాయాలుంటాయి.

**త్వరలో 'మూసీ ఉద్యోగాల' భర్తీ**

మూసీని సుందరీకరించడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు. నది పునరుజ్జీవ ప్రాజెక్టు నిర్మాణ దశలో 100 శాశ్వత పోస్టులను ఏర్పాటు చేసి భర్తీ చేయడంతో పాటు తాత్కాలిక ప్రాతిపదికన 3 వేల మంది ఉద్యోగులను నియమించనున్నారు. కార్యాచరణ దశలో 200 శాశ్వత పోస్టులతో పాటు తాత్కాలిక ప్రాతిపదికన మరో 200 పోస్టులు ఏర్పాటు చేసి నియామకాలు జరుపుతారు. మూసీని నైట్ (రాత్రి) ఎకానమీగా, అదనపు ఆదాయాన్ని సమకూర్చే వనరుగా అభివృద్ధి చేయాలని సీఎం నిర్ణయించారు. ఈ మేరకు మూసీ చుట్టూ యాంఫీ థియేటర్లు, షాపింగ్ మాల్స్, ఎంటర్‌టైన్‌మెంట్ పార్కులు, వీధి విక్రేతల దుకాణాలు, కియోస్క్‌లు వంటి వ్యాపార, వాణిజ్య నిర్మాణాలను చేపడతారు. లైట్ అండ్ సౌండ్ షోలు, వాటర్ స్పోర్ట్స్, మేళాలు, సాంస్కృతిక వేదికలు కూడా ఉంటాయి.

# బీఆర్ఎస్ పార్టీతో నాకు ఎలాంటి సంబంధం లేదు

మొదటిపేజీ తరువాయి



రెండు నెలలు ఆగి ఎన్నికలు నిర్వహిస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టమేంటని ఆమె ప్రశ్నించారు. ఒకవైపు జీవో ఇచ్చి, మరోవైపు తమ అనుచరులతోనే కోర్టులో కేసు వేయించారని, ఈ విషయం సోషల్ మీడియాలో కూడా చర్చనీయాంశమైందని ఆమె వ్యాఖ్యానించారు. గ్రామాల్లో లేని సామాజికవర్గాలకు కూడా రిజర్వేషన్లు కేటాయించడం గందరగోళానికి దారితీస్తోందని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన వివరాలను బయటపెడితే రిజర్వేషన్ల కేటాయింపులో స్పష్టత వస్తుందని కవిత సూచించారు. ఇదే సమయంలో, స్థానిక ఎన్నికలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపైనా కవిత తీవ్రంగా స్పందించారు. న్యాయస్థానాలను తప్పుదోవ పట్టించేలా ఈటల మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యలు సొంతమా లేక పార్టీవి చెప్పించారా అని నిలదీశారు. ఈ వ్యాఖ్యల పట్ల ఈటల రాజేందర్ బీసీ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. మరోవైపు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలను మార్చి గెజిట్ విడుదల చేసిందని ఆరోపించారు. అయితే, బతుకమ్మ నిమజ్జన కార్యక్రమంలో సీఎం పాల్గొనడాన్ని ఆమె స్వాగతించారు. ఈ సందర్భంగా, తనకు బీఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని కవిత స్పష్టం చేయడం గమనార్హం.



# మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాల్సిందే

మొదటిపేజీ తరువాయి

విఫలమయ్యాయని భావిస్తున్నాం. లొంగిపోయిన వారికి అన్ని రకాలుగా అండగా ఉంటాం. రాష్ట్రంలో పోలీసు స్టేషన్ల సంఖ్య కంటే పోలీసుల్లో నైపుణ్యాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. పోలీసు శాఖ ప్రత్యేక విభాగాల్లోని ఖాళీలను నిపుణులతో భర్తీ చేస్తాం'' అని డీజీపీ తెలిపారు.



# అసత్యంపై ఆర్ఎస్ఎస్ పోరాటం

మొదటిపేజీ తరువాయి

వైద్యం, రైతులకు అనేకవిధాలుగా సంఘ్ సేవలు అందిస్తోంది. మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తోంది. ఆర్ఎస్ఎస్ చేసే ప్రతి పనిలో నేషన్ ఫస్ట్ అనేది కన్పిస్తోంది. గతంలో సంస్థ స్ఫూర్తిని అణచివేసేందుకు తప్పుడు కేసులు బనాయించడం, నిషేధించడం వంటి అనేక ప్రయత్నాలు జరిగాయి. అయినా ఆర్ఎస్ఎస్ అన్నింటినీ తట్టుకొని నిలబడింది' అని మోదీ పేర్కొన్నారు. అనేక సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ ఈ సంస్థ నేటికీ బలంగా నిలబడిందన్నారు. అవిశ్రాంతంగా దేశానికి, సమాజానికి సేవ చేస్తోందన్నారు. వారి ప్రయత్నాలు దేశంపై ఉన్న భక్తి, త్యాగం, నిబద్ధతకు నిదర్శనమన్నారు. తాజాగా విడుదల చేసిన రూ.100 నాణెంపై ఓవైపు జాతీయచిహ్నం.. మరోవైపు భారతమాత చిత్రం ఉంటుందన్నారు. స్వతంత్ర భారత దేశ చరిత్రలో మన కరెన్సీపై భరతమాత ఉండటం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.




# డిఫెన్స్‌లో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

మొదటిపేజీ తరువాయి

యుద్ధాల్లో ఆధునిక సాంకేతికత బాగా పెరిగిందని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. ఇది మనకు ఆందోళన కలిగించే విషయమన్నారు. కొత్తగా వస్తున్న సాంకేతికతలు ఏళ్లతరబడి పరిశోధన, అభివృద్ధి ఆధారంగా రూపొందించినవన్నారు. దీన్ని మనం కూడా అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మన చుట్టూ ఉన్న పరిస్థితులు మారిపోతున్నాయని, భద్రతా అవసరాలు పెరిగిపోయాయని వ్యాఖ్యానించారు. అందుకే రక్షణ బడ్జెట్ కూడా ఏటా పెరుగుతుందని తెలిపారు. బడ్జెట్ పెరుగుదలతో దాన్ని తెలివిగా ఉపయోగించాల్సిన బాధ్యత రెట్టింపు అయ్యిందన్నారు. ఈ సందర్భంగా సాంకేతిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మన సాంకేతికత వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు నిధులు పెంచుతున్నట్లు తెలిపారు.

# కానిస్టేబుల్ టూ ఎంపిడిఓ

- **ఎంపిడిఓ గా ఎంపికైన చిప్ప గణేష్ కు కలెక్టర్అభినందనలు.**

పెద్దపల్లి,అక్టోబర్01(ప్రజా స్వరం):

పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ను ఇటీవలె గ్రూప్ 1 లో ఎంపిక అయిన,చిప్ప గణేష్,జూనియర్ అసిస్టెంట్ మర్యాదపూర్వకంగా కలిశారు.సెప్టెంబర్ 25న విడుదలైన గ్రూప్1 ఫలితాలలో పెద్దపల్లి జిల్లా గోదావరిఖని కి చెందిన చిప్ప గణేష్ 410వ ర్యాంక్ రావడంతో ఎంపిడిఓ గా ఎంపిక అయ్యారు.2020 సంవత్సరంలో సివిల్ కానిస్టేబుల్ గా ఎంపికైన చిప్ప గణేష్ పని చేస్తూనే ఉన్నత ఉద్యోగం సాధించాలని కష్టపడి చదువుకున్నారు.2024 లో విడుదలైన గ్రూప్ ఫోర్ పరీక్ష ఫలితాల్లో ఎంపికయ్యారు. నేడు గ్రూప్ 1 అధికారిగా ఎంపిడిఓ గా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని కలెక్టర్ తెలిపారు.కానిస్టేబుల్ నుంచి గ్రూప్1 అధికారి స్థాయికి ఎదిగిన చిప్ప గణేష్ ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం ఇటీవల విడుదలైన గ్రూప్ 2 ఫలితాలో ఏ.సి.టి.ఓ గా ఎంపికైన అర్ల సాగర్ ను కలెక్టర్ అభినందించారు.



## ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు



మెదక్ అక్టోబర్ 01 (ప్రజా స్వరం) అక్టోబర్ 2 న విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని దసరా సందర్భంగా మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రజలకు బుధవారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయాన్ని గుర్తుచేస్తూ, ప్రజలు పండుగను ఆనందోత్సవాలతో జరుపుకోవాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, జిల్లా సుభిక్షంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో, సిరిసంపదలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, ఈ దసరా జిల్లా ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని అన్నారు. జగన్మాత ఆశీస్సులతో జిల్లా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని వివరించారు.

## కష్టపడితే ఫలితం వస్తుందనడానికి నిదర్శనం



- **ఫిర్యాదుదారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి.**
- **జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు...**
- **డీఎస్పీ ఉద్యోగం సాధించిన వారికి సన్మానం**

మెదక్ అక్టోబర్ 01 (ప్రజా స్వరం) గ్రూప్1 డీఎస్పీ ఉద్యోగం సాధించిన శైలేష్, ప్రభాత్ రెడ్డి, ప్రణయ్ సాయి ను బుధవారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కష్టపడి చదివి డీఎస్పీ ఉద్యోగం సాధించిన ముగ్గురినీ అభినందించారు. వారిని ప్రోత్సహించిన తల్లి దండ్రులకు కూడా శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగం సాధించడానికి ఎంత కృషి చేశారో, ప్రజలకు సేవ చేయడంలో కూడా అంతే శ్రమ చూపాలి. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. అలాగే, కష్టపడి చదివితే ఎంతటి లక్ష్యం అయినా సాధించవచ్చని, సమాజంలో పేరు ప్రతిష్టలు పొందవచ్చని అన్నారు. ఉద్యోగం వచ్చిన తర్వాత కూడా అదే పట్టుదలతో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఫిర్యాదుదారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని తెలిపారు. తెలంగాణ పోలీస్ దేశంలోనే ఉత్తమ పోలీస్ వ్యవస్థగా నిలిచింది. మీరు ఆ కుటుంబంలో చేరి గౌరవాన్ని మరింత పెంచేలా నడుచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్ డీఎస్పీ రంగా నాయక్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ మధుసూదన్ గౌడ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్ఎస్ఎస్ శాఖతో హిందుత్వంలో ఐక్యత



- **దేశ నిర్మాణమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం**
- **హిందుత్వ జీవన విధానం విశ్వశాంతికి ఆధారం**
- **జిల్లా ధర్మ జాగరణ ప్రముఖ్ ముత్యం రెడ్డి**

పెద్దేముల్, అక్టోబర్ 01(ప్రజాస్వరం): వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం చేయడమే ఆర్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యమని.. ఆర్ఎస్ఎస్ శాఖతో హిందుత్వంలో ఐక్యత పెంపొందుతుందని జిల్లా ధర్మ జాగరణ ప్రముఖ్ ముత్యం రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆర్ఎస్ఎస్ వందేళ్ల శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఇందూరు శాఖ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు స్వయం సేవకులు గ్రామంలోని పురవీధుల గుండా కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని మైసమ్మ మందిరం దగ్గర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త ముత్యం రెడ్డి మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ 1925లో ప్రారంభమై నేడు దేశవ్యాప్తంగా విస్తృత శాఖలతో, విభిన్న రంగాలలో దేశభక్తి పూరిత, హిందుత్వ ఆధార సంస్థలతో ప్రపంచంలోని అనేక దేశాలలో పనిచేస్తుందని తెలిపారు. హిందూవులలో ఐక్యతను శాఖ ఆధారంగా సంఘము పెంపొందిస్తుందని చెప్పారు. హిందుత్వం జీవన విధానం, విశ్వశాంతికి ఆధారమని, ప్రపంచంలోని వివిధ మతాలను సమన్వయపరిచే సనాతన జీవన విలువలు హిందుత్వంలో ఉన్నాయని వివరించారు. దేశ అభివృద్ధి కొరకు హిందువులు పంచ పరివర్తన కోసం పాటుపడాలని సూచించారు. సామాజిక సమరసత, కుటుంబ జీవన విలువలు, స్వఆధారిత జీవనం మరియు పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు ప్రతి ఒక్కరి కుటుంబంలో పాటించబడాలన్నారు. ఆర్ఎస్ఎస్ జన్మ శతాబ్దిలో భాగంగా రాబోయే రోజులలో ఇంటింటి జనజాగరణ చేపట్టబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, స్వయం సేవకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను మభ్యపెట్టి గతంలో ఓట్లు దండుకున్న కాంగ్రెస్





- **వికారాబాద్ జిల్లా బిజెపి నాయకుల ప్రెస్ మీట్**

వికారాబాద్, అక్టోబర్ 1(ప్రజా ఈ): తెలంగాణ రాష్ట్రంలో మోగిన ఎన్నికల నాగారా నేపథ్యంలో బుధ వారం భారతీయ జనతా పార్టీ సారథ్యంలో బిజెపి వికారాబాద్ జిల్లా కార్యాలయం (ఎన్నేపల్లి)లో పాత్రికేయుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ తరపున జిల్లాలోని అన్ని సర్పంచ్, ఎంపీటీసీలు, జడ్పిటిసి స్థానాల్లో పోటీకి నిలబెడతామని, ఈ ఎన్నికలు కార్యకర్తల ఎన్నికలు కాబట్టి కార్యకర్తలు గెలుపు దిశగా ప్రయత్నం చేస్తూ గ్రామాల్లో జరుగుతున్న అన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ నిధుల వల్లనే జరుగుతున్నాయని చెప్పారు.ఈ విషయాన్ని నాయకులు కార్యకర్తలు ప్రజలకు తెలియపరచి ప్రజాక్షేత్రంలో భారతీయ జనతా పార్టీ ని గెలిపించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ లు కేవలం గెలుపు కోసం అమలు కానీ ఆచరణీయం కానీ వాగ్దానాలు చేసి ప్రజలను మభ్యపెట్టి గతంలో ఓట్లు దండుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం ఆ మోసాన్ని గమనించిన యావత్ తెలంగాణ ప్రజలు సంస్థాగత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టడానికి సుముఖంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి మాజీ అధ్యక్షులు సదానంద రెడ్డి వెన్న ఈశ్వరప్ప ఓబీసీ మోర్చా జిల్లా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలేశ్వర్ గుప్తా ,జిల్లా ఎన్నికల కో కన్వీనర్ గణపురం వెంకటయ్య, కోకన్వీనర్ ఒడిత్యాల రాములు, జిల్లా ఎన్నికల కో కన్వీనర్ మరియన్ రెడ్డి, కో కన్వీనర్ శ్రీలత, మాజీ కౌన్సిలర్ పెద్దింటి నవీన్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే పెంటయ్య గుప్తా, జిఎస్ మాధవి, ప్రధాన కార్యదర్శి సాయి రెడ్డి, ఉపాధ్యక్షులు యాదయ్య, ఉపాధ్యక్షులు జి. శివరాజ్, ఉపాధ్యక్షులు రవి గౌడ్, కోకన్వీనర్ రఘుపతి, కార్యదర్శి పేట శంకర్, సీనియర్ నాయకులు సుదర్శన్ గౌడ్ ,ఉపాధ్యక్షులు జుంటుపల్లి వెంకట్ ,కార్యదర్శి టి రాఘవేందర్, సోషల్ మీడియా ఇంచార్జ్ మోహన్ రెడ్డి, మీడియా ఇంచార్జ్ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూమి పట్టాను నిలుపుదల చేయండి





- **పట్టామార్పిడి చేయరాదని అధికారులకు వినతి**
- **న్యాయం చేయాలని వేడుకున్న బాధితురాలు మాదారం గున్నమ్మ**
- **తహశీల్దార్ వెంకటేశ్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేత**

పెద్దేముల్, అక్టోబర్ 01(ప్రజాస్వరం): తన భర్త పేరిట ఉన్న భూమిని తమకు తెలియకుండా పట్టా మార్పిడి చేయరాదని బాధితురాలు మాదారం గున్నమ్మ కోరారు. బుధవారం తహశీల్దార్ వెంకటేశ్ ప్రసాద్‌కు లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ.. పెద్దేముల్ మండల పరిధిలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన మాదారం బల్వంత్ రెడ్డికి నాతోపాటు మరో రెండో భార్య సులోచన కూడా ఉందని తెలిపారు. బల్వంత్ రెడ్డికి తాను మొదటి భార్యనని చెప్పారు. బల్వంత్ రెడ్డి పేరిట గోపాల్‌పూర్ రెవెన్యూ పరిధిలో మొత్తం 11.13 ఎకరాల భూమి ఉందని తెలిపారు. అందులో సర్వే నంబర్ 50/ఉలో 2.07ఎకరాలు, సర్వే నంబరు 50/ఉ1లో 2.17ఎకరాలు, సర్వే నంబరు 67/అ1లో 3.12ఎకరాలు, సర్వే నంబరు 67/01ఆలో 0.10గుంటలు, 91/ఇ సర్వే నంబరులో 3.07ఎకరాలు ఉందని వెల్లడించారు. అయితే ఈ భూమిని తన భర్త(బల్వంత్ రెడ్డి)కి రెండో భార్య అయిన సులోచన తనకు తెలియకుండా పట్టా మార్పిడి చేసుకునే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. తాను కూడా ఆ భూమికి హక్కుదారురాలు అని, ఆ భూమిని తమకు సమాచారం ఇవ్వకుండా పట్టా మార్పిడి చేయరాదని వినతి పత్రంలో పేర్కొన్నారు. పట్టా మార్పిడి చేసే ముందు తమను కూడా పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా తన భర్త మరణ ధ్రువీకరణ పత్రం మంజూరి విషయంలో, వ్యవసాయ శాఖకు సంబంధించిన సంక్షేమ పథకాల తరుపున పొందాల్సిన ప్రయోజనాల్లో తమను పరిగణలోకి తీసుకోవాలని వేర్వేరు సమయంలో ఇంఛార్జి ఎంపీడీఓ రతన్ సింగ్, వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ విషయంలో అధికారులు తగు చర్యలు తీసుకొని తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

# దేవరయాంజాల్‌లో అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలు





శామీర్ పేట అక్టోబర్ 01(ప్రజాస్వరం) తెలంగాణ సంస్కృతి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ చివరి రోజు సద్దుల బతుకమ్మ తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ లో అత్యంత ఉత్సాహంగా, అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. పూల పట్ల భక్తి ప్రకృతి పట్ల మమకారం, ప్రపంచ వ్యాప్తంగా పూలను అలంకారంగా ఉపయోగించినా, తెలంగాణలో మాత్రం పూలే దేవతలుగా ఆరాధించబడతాయి.ఇది తెలంగాణ సమాజం ప్రకృతితో కలిపి బ్రతుకే సాంస్కృతిక జీవన విధానానికి అద్దం పడుతుంది. గ్రామమంతా పూలతో నిండిన పండుగ వాతావరణం తొమ్మిది రోజుల పాటు ఇంటింటా గౌరమ్మకు పూజలతో సాగిన ఈ పండుగ, చివరి రోజు వివిధ రకాల పూలతో అలంకరించిన బతుకమ్మలను మహిళలు ఉత్సాహంగా చెరువుకు తీసుకెళ్లి పాటలతో, నాట్యాలతో పూల జాతరతో వేడుకలలో మునిగిపోయారు. చెరువు వద్ద మున్సిపల్ అధికారులు ,సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు సహకరించారు. పెద్ద బతుకమ్మలు పేర్చిన మహిళలకి నాయకులు వెండి బతుకమ్మలు, నగదు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ,అల్వాల్ సొసైటీ డైరెక్టర్ నాలుక యాదగిరి, కళా మండలి అధ్యక్షులు యన్ వై అశోక్, జిల్లా రిజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్లు గోల్డ్ శ్రీనివాస్, తిరుపతి లావణ్య శంకర్ గౌడ్, శ్రీ సీతారామ స్వామి దేవస్థానం చైర్మన్ పేండం లక్ష్మి నారాయణ, ధర్మకర్తలు ఎల్లెంకి భారతి, నానిగళ్ళ హరిగోపాల్, గుడిసేని హరికృష్ణ, భీమిడి కోండల్ రెడ్డి, తూంకుంట జగదీష్ గౌడ్, రామాలయం మాజీ చైర్మన్లు దాసరి గోపాల్ రెడ్డి, పన్నాల సుధాకర్ రెడ్డి, మున్సిపల్ బిజెపి అధ్యక్షులు పట్నం నర్సింహా రెడ్డి, రామాలయం మాజీ ధర్మకర్తలు పట్నం నర్సింహా రెడ్డి, బక్కోల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు కోనేరు నర్సింగ్ రావు, నర్సింగ్ రావు గౌడ్, బక్కోల యాదమ్మ నర్సింగ్ రావు, ఇదంబోయిన ఉమ శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు రంగప్ప,భారతి నాగరాజు గౌడ్, దూసరి మమత మహేష్‌గౌడ్, జూపల్లి శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు పిన్నింటి ధర్మారెడ్డి, బెంబడి జంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ అనంత పద్మనాభుడి పెరుగు బసంతం



వికారాబాద్, అక్టోబర్ 1(ప్రజా స్వరం): వికారాబాద్ జిల్లా కేంద్రంలో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైనాయి. వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లి వద్ద ఉన్న శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయంలో బుధవారం పల్లకి సేవా కార్యక్రమం,పెరుగు, బసంతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతగిరి గుట్టపై ఉన్న శ్రీ అనంతపద్మనాభ స్వామి ప్రధాన ఆలయం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలంపల్లి శ్రీ అనంత పద్మనాభ స్వామి చిన్న ఆలయానికి పల్లకి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెరుగు బసంతం కార్యక్రమాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దసరా ఉత్సవాల సందర్భంగా ప్రతి ఏటా ఆనవాయితీగా ఈ పల్లకి సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. దసరా పండుగ రోజు కూడా శ్రీ అనంతపద్మనాభ స్వామి వారి పల్లకి సేవా కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ఆలంపల్లి అనంత పద్మనాభ స్వామి వారి ఆలయ పరిధిలో జాతర ఉత్సవాలు కూడా జరగనున్నాయి. కాగా బుధవారం దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళహారతి పెరుగు బసంతం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పల్లకి సేవా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ దంపతులు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు















## ఆధ్యాత్మిక, రాజకీయ, ఆర్థిక ప్రాముఖ్యతకు ప్రసిద్ధికి నెలవు మసాయిపేట

మాసాయిపేట అక్టోబర్ 01 (ప్రజాస్వరం) హైదరాబాద్ నుండి దాదాపు 60 కి.మీ దూరంలో ఉన్న మండల ప్రధాన కార్యాలయం మాసాయిపేట, ఆధ్యాత్మిక, రాజకీయ మరియు ఆర్థిక ప్రాముఖ్యతకు ప్రసిద్ధి చెందింది, విజయదశమిని జరుపుకునే దాని స్వంత విధానాన్ని ఇప్పుడు గుర్తుచేసుకుంటోంది. పురాతన కాలం నుండి కొనసాగుతున్న ఈ ఆచారం ఇప్పుడు ఎంతో గౌరవించబడుతోంది మరియు జరుపుకుంటున్నారు. గ్రామంలో ఉన్న 500 సంవత్సరాల పురాతనమైన పంఢ్రాంగ విఠలేశ్వర ఆలయం లోతైన మరియు చారిత్రాత్మక ఆధ్యాత్మిక సంబంధాన్ని కలిగి ఉంది. గ్రామస్తులు క్రమం తప్పకుండా సందర్శించకపోయినా, ప్రతి సంవత్సరం విజయదశమి నాడు విఠల్ ఆలయాన్ని సందర్శించడం ఒక సాధారణ కార్యక్రమం. రాష్ట్ర పక్షిగా ఉన్న పాలపిట్టను సందర్శించి, వెంటనే విఠల్‌ను సందర్శించి, విజయం మరియు శ్రేయస్సు కోసం ప్రార్థించే అన్ని గ్రామాల ప్రజలు ఈ నమ్మకం కలిగి ఉన్నారు. ఏ గ్రామం మాదిరిగానే, జమ్మి పూజ, ఆయుధ పూజ వంటి విఠల్ దర్శనం తర్వాత మాత్రమే విఠల్ పూజ, ఆయుధ పూజ వంటి విఠల్ దర్శనం జరుగుతుంది. భక్తులకు ఇచ్చే ప్రసాదం అయిన రక్తశితాలను చాలా పవిత్రంగా భావిస్తారు మరియు భక్తులు లాకర్లలో, వ్యాపార ప్రదేశాలలో భద్రపరుస్తారు మరియు అధిక దిగుబడి మరియు లాభం చేకూరుస్తుందని నమ్ముతూ వ్యవసాయ పొలాలలో ఉంచుతారు. ఇది పురాతన కాలం నుండి వస్తున్న ఆచారం మరియు గ్రామస్తులు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. విజయదశమి నాడు జరిగే విఠల విజయోత్సాహోత్సవం భవానీ దేవతకు మూడు రోజుల ప్రత్యేక పూజల ద్వారా దేవి త్రిరాత్రోత్సవంగా జరుగుతుంది.



## స్థానిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు
# నాయకులు సహకరించాలి







- **వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

వికారాబాద్, అక్టోబర్ 1 (ప్రజాస్వరం): స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. ఎంపీటీసీ,జడ్పిటిసి, గ్రామపంచాయతీ సర్పంచ్ వార్డు మెంబర్ల ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి అని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. రాజకీయ పార్టీ నాయకులు, అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్, ఎలక్షన్ అథారిటి ప్రతీక్ జైన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి, గ్రామపంచాయతీ సర్పంచ్,వార్డు మెంబర్ల ఎన్నికల నిర్వహణకు జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎన్నికల (నియమావళి) పాటించి, సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎన్నికల విభాగం సంబంధిత సిబ్బందితో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోయే ఎన్నికలలో ప్రతి ఒక్కరూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, (ఎన్నికల నియమావళి) ని పాటిస్తూ ఎన్నికల నిబంధనలకు సంబంధించి తీసుకోవలసిన చర్యలు, నామినేషన్ల ప్రక్రియ, స్క్రూటీని, ఖర్చుల వివరాలు, ఎన్నికలు నిబంధనలు తదితర అంశాలపై రాజకీయ పార్టీలవారికీ కలెక్టర్ వివరించారు.మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ డి ఇ ఓ, బ్యాలెట్ బాక్స్ మేనేజ్మెంట్ డి పి ఓ,మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రతి మండలానికి అధికారులను నియమించడం జరిగిందని , ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎస్ ఎస్ టి ,వీడియో వింగ్, తదితర ఎన్నికల నిర్వహణ కమిటీలకు ప్రత్యేక అధికారులను నియమించి ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కల్లెక్త్రేట్ కార్యాలయము లో ఎన్నికల సందర్భంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని , ఫోన్ నెంబరు 08416235291 కు సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) సుధీర్, (రెవెన్యూ) లింగ్యా నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి ,డి పి ఓ జయసుధ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ యత్రిదేవిగా అమ్మవారు

శామీర్ పేట, అక్టోబర్ 1 ( ప్రజాస్వరం) శ్రీ గాయత్రి మహా క్షేత్రంలో అమ్మవారు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. శామీర్ పేట మండలం తూంకుంట పరిధిలోని శ్రీ గాయత్రి మహా క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ వ్యవస్థాపకులు శిష్య పరివ్రాజక, వాక్ బ్రహ్మ, శ్రీ రాఘవేంద్ర స్వామి ఉపాసకులు డాక్టర్ ఎస్వీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో అమ్మవారిని బుధవారం శ్రీ గాయత్రి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.ఈ సందర్భంగా ప్రజలు తమతమ కోరికలను అమ్మవారికి పూజలు చేసిన అనంతరం కోరుకున్నారు.



# రైలు కిందపడి ఏఎస్ఐ మృతి




తాండూరు, అక్టోబర్ 1 (ప్రజాస్వరం) నడుస్తున్న రైలు ఎక్కబోయి జారి రైలు కింద పడి తీవ్రంగా గాయపడిన రైల్వే ఏఎస్ఐ చికిత్స పొందుతూ; బుధవారం ప్రాణం విడిచాడు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం రాత్రి వికారాబాద్ జిల్లా తాండూరు రైల్వే స్టేషన్లో నడుస్తున్న రైలు ఎక్కడానికి ప్రయత్నించిన ఏఎస్ఐ మారుతి(49) తీవ్రంగా గాయపడ్డారు.కర్ణాటక రాష్ట్రం చించొల్లి తాలూకా మర్పల్లికి చెందిన మారుతి కల్బుర్గి జిల్లా జేడిహల్లి పోలీస్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి తాండూరు నుంచి బెంగళూరు వెళ్లేందుకు వచ్చారు. అప్పటికే యశ్వంత్ పూర్ రైలు ముందుకు కదలడంతో మారుతి రైలు ఎక్కేందుకు పరిగెత్తారు. రైలు కదులుతుండడంతో ఆయన అదుపుతప్పి పడిపోయారు.ఈక్రమంలో ఆయన రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంభీకులు ఆయనను మెరుగైన వైద్యం కోసం కల్బుర్గి జిల్లాలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మారుతి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో భవాని మాతకు పూజలు




వికారాబాద్, (ప్రజాస్వరం): దసరా పండుగ సందర్భంగా నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో బుధవారం వికారాబాద్ జిల్లా వికారాబాద్, తాండూరు ,పరిగి, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో భవాని మాత ఆలయాలు భక్తులతో కిటకిటలాదాయి. పలుచోట్లదుర్గామత అమ్మవారి పూజ కార్యక్రమం, అన్నదాన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తాండూరు పట్టణంలోని కాళికాదేవి ఆలయంలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దోమ మండల కేంద్రంలోని పాలేపల్లి పార్టీ నాయకులు సంతోష్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గామత అమ్మవారి పూజ కార్యక్రమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు .అమ్మవారి పూజ కార్యక్రమంలో పాల్గొన్న పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దోమ మండల వైస్ ఎంపీపీ మల్లేశం, పరిగి పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు,దోమ సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు రాజి రెడ్డి, రవి పాలేపల్లి ఇప్పటయ్య, తిరుపతయ్య, పురుషోత్తం, అంజిలయ్య,వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.



# సాయిపూర్ ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

- **ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పైలెట్_రోహిత్_రెడ్డి**



తాండూరు, అక్టోబర్ 1 (ప్రజాస్వరం): తాండూరు పట్టణంలోని 9వ వార్డ్ సాయిపూర్ లో మున్సిపల్ మాజీ వైస్‌చైర్ పర్సన్ పట్లోళ్ల_దీప_నర్సింలు ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ సంబరాలను మంగళవారం సాయిపూర్ లో ఘనంగా నిర్వహించారు. ప్రత్యక విద్యుత్ వెలుగులు విరజిమ్ముతూ ఏర్పాటు చేసిన రథంలో బతుకమ్మను ఊరేగించారు.

.రంగురంగుల దీపాల అలకరణలతో ఘనంగా నిర్వహించిన బతుకమ్మ ఏర్పాట్లు మహిళలను ఆకట్టుకున్నాయి ఏటా నిర్వహిస్తున్న విధంగానే ప్రత్యక గుర్తింపు చాటుకునేలా తాండూరు నియోజకవర్గంలోనే పెద్దఎత్తున్న పట్టణంలోని సాయిపూర్ లో తాండూరు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల_దీప_నర్సింలు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ బతుకమ్మ వేడుకలలో మహిళలు,ప్రజాప్రతినిధులు వివిధ రాజకీయ ప్రముఖులు పాల్గొని తాండూరు పట్టణం మారుమోగేలా బతుకమ్మ వేడుకలను అట్టహాసంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా దీప_నర్సింలు మహిళలతో కలసి ఆటపాటలతో బతుకమ్మ ఆడిపాడారు. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి కూడా ఈ వేడుకల్లో పాల్గొనగా ఆయనతో పాటు ఆయన మాతృమూర్తి ప్రమోదీని_రెడ్డి మహిళలతో కలసి సద్దుల బతుకమ్మ సంబరాల్లో ఆడిపాడారు.





# శ్రీ దుర్గామాత అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దంపతులు

పరిగి, అక్టోబర్ 1(ప్రజా స్వరం): *పరిగి పట్టణంలోని బహార్ పేట్ హనుమాన్ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీ దుర్గామాత అమ్మవారిని బుధ వారం పరిగి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ఉమారెడ్డి దంపతులు స్థానిక నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

శామీర్ పేట అక్టోబర్ 01(ప్రజాస్వరం) రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి. మరొకరి గాయాలైన సంఘటన బుధవారం శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మూడు చింతలపల్లి మండలం, అద్రాస్ పల్లి గ్రామనికి చెందిన దొండ తనుష్ (19) విద్యార్థి, అతని మిత్రుడు బి. సాయి దీపక్ లు ఇద్దరు కలిసి బుధవారం ఉదయం డీజిల్ కోసం సాయి దీపక్ కు చెందిన ఏపీ 29 ఏవి 2291 నెంబర్ కారులో మూడుచింతలపల్లికి వెళ్లారు. కారులో డీజిల్ నింపుకొని తిరిగి అద్రాస్ పల్లి గ్రామనికి వస్తుండగా మార్గమధ్యంలోని లింగాపూర్ తండా సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో కారు డ్రైవింగ్ చేస్తున్న తనుష్ తల, కాళ్ళు, శరీరంలోని ఇతర భాగాలపై తీవ్ర రక్త గాయాలు కాగా, మిత్రుడు సాయి దీపక్ భుజం, ముఖం ఇతర శరీర భాగాలపై రక్త గాయాలు అయ్యాయి. వెంటనే కీసరలోని ఓ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి తనుష్ మృతి చెందినట్లు తెలిపారు. గాయపడిన సాయి దీపక్‌ను చికిత్స కోసం అల్వాల్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





# విజయదశమి అందరికి విజయాలు చేకూర్చాలే

- **మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



పెద్దపల్లి , అక్టోబర్01(ప్రజా స్వరం): సకల విజయాలను అందించే విజయదశమి మంథని నియోజకవర్గ ప్రజలకు విజయాలను చేకూర్చాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆకాంక్షించారు.అమ్మవారి దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని,ప్రతి ఏటా ఇలాంటి విజయదశమి వేడుకలను మంథని నియోజకవర్గ ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని అమ్మవారిని కోరుకుంటున్నట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలు,బీఆర్ఎస్ పార్టీశ్రేణులు,అభిమానులకు విజయదశమి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సంతోషంగా దసరా పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు.

# స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి ,అక్టోబర్01(ప్రజా స్వరం): బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపెల్లి జిల్లాలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల,రామగిరి లోని జేఎన్టీయూ మంథని ఇంజనీరింగ్ కళాశాల,గోదావరిఖనిలోని ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాలలను స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు నిమిత్తం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ,డి.సి.పి కరుణాకర్ లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో పెద్దపల్లి నియోజకవర్గం పరిధిలోని 6 మండలాలు,రామగిరి మండలంలోని జేఎన్టియు కళాశాలలో మంథని నియోజకవర్గ పరిధిలోని 4 మండలాలు,గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ మరియు పి.జి (గోదావరిఖని) కళాశాల లో పాలకుర్తి,అంతర్గం, ధర్మారం,మండలాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు భద్రపర్చేందుకు స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు.స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు,కౌంటింగ్ నిర్వహణ సంసిద్ధత ను కలెక్టర్ పరిశీలించారు.మంథని,గోదావరిఖని నియోజకవర్గలాకు సంబంధించి 7 మండలాలకు స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ అక్టోబర్ 23న, పెద్దపల్లి నియోజకవర్గానికి సంబంధించి 6 మండలాలకు పోలింగ్ అక్టోబర్ 27న జరుగుతుందని అన్నారు.ఈ పర్యటనలో జడ్పీ సీఈవో నరేందర్,ఆర్డీవో లు గంగయ్య,సురేష్,తాహసిల్దారులు,ఎంపీడీవోలు,పోలీస్ అధికారులు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# బతుకమ్మ సంబరాలు మహాసాంస్కృతికోత్సవంగా

దౌల్తాబాద్, అక్టోబర్ 01 (ప్రజా స్వరం): "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో" అంటూ మండల వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకాయి. ప్రతి గ్రామం పూలతో కళకళలాడింది. సంప్రదాయ చీరలు ధరించిన ఆడపడుచులు, చిన్నారులు, యువతులు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ జానపద గీతాలు పాడి ఆడిపాడారు. కొందరు పల్లె పాటలతో, మరికొందరు డిజె సౌండ్ తో ఉత్సవాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దారు.

బతుకమ్మ చరిత్ర, పురాణ ప్రాముఖ్యత

బతుకమ్మ పండుగను తెలంగాణ ఆడపడుచులు పంటలు పండిన ఆనందంలో, తల్లి భూమికి కృతజ్ఞతగా జరుపుకుంటారు.పురాణ కథనం ప్రకారం చోళరాజు కుమార్తె సతీదేవి మరణించినప్పుడు ప్రజలు ఆమె కోసం పూలతో చేసిన బతుకమ్మను పూజించారు. "అమ్మ బతికాలి" అన్న సంకల్పంతో బతుకమ్మ అనే పేరు ఏర్పడింది. మరో విశ్వాసం ప్రకారం, బతుకమ్మను గౌరమ్మకు ప్రతీకగా పూజించి సౌభాగ్యం, ఆరోగ్యం, ఐశ్వర్యం కోసం ప్రార్థిస్తారు.

బతుకమ్మ రకాల విశిష్టతలు

సద్దుల బతుకమ్మ: తొమ్మిదిరోజుల ఉత్సవంలో ఒక ప్రత్యేక రోజు సద్దులతో (అన్నపిండితో చేసిన వంటకాలు) బతుకమ్మను అలంకరించడం ప్రత్యేకత. చిన్న బతుకమ్మ: చిన్నారులు ఆడుకునే రీతిలో చిన్న బతుకమ్మలను తయారు చేస్తారు. పెదబతుకమ్మ: ఉత్సవానికి చివరి రోజు పెద్ద బతుకమ్మను ఊరంతా కలసి చెరువులో నిమజ్జనం చేస్తారు.

బతుకమ్మ పూల ప్రాధాన్యం

బతుకమ్మ పండుగలో సంప్రదాయ పూలు ఉపయోగించడం విశేషం. ప్రతి పూలకూ ఒక ప్రత్యేకమైన అర్థం ఉంది:

తంగేడు పువ్వు - తల్లి భూమి ప్రతీక.
గున్నేరు పువ్వు - శక్తి, శుభ సూచకం.
బంతి పువ్వు - సౌరశక్తి, ఆరోగ్యం.
చామంతి పువ్వు - దీర్ఘాయుష్షు, సంతోషం.
గురిజాలు, పగడపువ్వులు - వైద్యం, ఆరాధనలో ప్రత్యేకత.
పూల వనమాల - ఆడపడుచుల ఐక్యతకు ప్రతీక.

ఈ పూలతో చేసిన బతుకమ్మలు ప్రకృతి - మనిషి అనుబంధానికి ప్రతీకగా నిలుస్తాయి.

దౌల్తాబాద్ లో వైభవం

మండలంలోని ప్రతి ఊరు పూలతో అలరారింది. సాంప్రదాయం, ఆధునికత కలగలిసి పండుగను మరింత భిన్నంగా తీర్చిదిద్దాయి. చిన్నారులు ఆడిన బతుకమ్మ ఆటలు, యువతులు పాడిన గేయాలు, మహిళల చీరల రంగుల్లా పల్లెలు కళకళలాడాయి. మొత్తానికి, ఈ ఏడాది దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా జరిగిన బతుకమ్మ పండుగ పూల అందం - పాటల శోభ - మహిళల ఐక్యత - పురాణ గాథలు - సాంప్రదాయ విశిష్టత అన్నీ కలిసిన ఒక సాంస్కృతిక మహోత్సవంగా నిలిచింది.







# నిబంధనలు పాటించని మెడికల్ ఏజెన్సీలపై చర్యలు

పెద్దపల్లి ,అక్టోబర్01(ప్రజా స్వరం): ప్రభుత్వ నిబంధనలు పాటించని మెడికల్ ఏజెన్సీల పైన చర్యలు తీసుకోవాలని ఎన్ ఎఫ్ హెచ్ ఆర్ సి స్టేట్ అడిషనల్ జనరల్ సెక్రటరీ నల్మాస్ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.మెడికల్ ఏజెన్సీలు వివిధ రకాల కంపెనీల పేరుతో సరఫరా చేస్తున్న నాణ్యతలేని మందుల వల్ల సామాన్య ప్రజానికం ఇబ్బంది పడుతుందని అటువంటి మెడికల్ ఏజెన్సీల పైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.డ్రగ్ ఇన్స్పెక్టర్ ఎడి డ్రగ్స్ అధికారులు మామూళ్ల మత్తులో పడి ఎలాంటి తనిఖీలు నిర్వహించడం లేదని ఆయన పేర్కొన్నారు.ఇప్పటికైనా అధికారులు నిబంధనలు పాటించని మెడికల్ ఏజెన్సీల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## చీరలు పంపిణీ చేసిన
# లక్ష్మీ ప్రభాకర్ గౌడ్

మనోహరబాద్ ( ప్రజాస్వరం ) : కాల్లాకల్ గ్రామ పంచాయతీ సిబ్బందికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాళ్లకల్ మాజీ వార్డు సభ్యులు అచ్చగౌని లక్ష్మీ ప్రభాక ర్ గౌడ్ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి దసరా పండుగకు చీరలు పంపిణీ చేస్తున్నానని తెలిపారు.



# అమ్మవారి దీవెనలు అందరిపై ఉండాలే



పెద్దపల్లి ,అక్టోబర్01(ప్రజా స్వరం): దుర్గామాత అమ్మవారి దీవెనలు,ఆశీస్సులు అందరిపై ఉండాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వేడుకున్నారు.దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మంథని పట్టణంలోని హనుమాన్ నగర్ లో ప్రతిష్ఠించిన దుర్గామాతను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ శైలజ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.నియోజకవర్గ ప్రజలు అమ్మవారి దీవెనలతో సంతోషంగా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ శైలజ దంపతులను సన్మానించారు.

## ఘనంగా బతుకమ్మ వేడుకలు



మాసాయిపేట అక్టోబర్ 02 (ప్రజాస్వరం) మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన బతుకమ్మ ఉత్సవాలు బుధవారం సద్దుల బతుకమ్మతో ముగిసాయి.రంగురంగుల పువ్వులతో పెద్ద పెద్ద బతుకమ్మలు తయారుచేసిన మహిళలు గ్రామ చావడిలో ఏర్పాటు చేసి, సాంప్రదాయ పాటలు పాడుతూ బతుకమ్మ ఆటలు ఆడారు. చెరువులో నిమజ్జనం చేసి పోయిరా బతుకమ్మ అంటూ వీడ్కోలు పలికారు

## పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అన్నదానం



శామీర్ పేట అక్టోబర్ 01 (ప్రజాస్వరం) శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ఘనంగా అన్నదానం చేపట్టారు. బుధవారం శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ ఉప్పర్ పల్లి పరిధిలో ని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద కి.శే డడ్డం బసవ రెడ్డి ధర్మపత్ని కె.కె. సుగుణమ్మ కుమరులు. కొడళ్ళు గోపర్దన్ రెడ్డి స్వర్ణలత వెంకటేశ్వరరెడ్డి. లక్ష్మిబార్గవి గ్రామం. ఐనాపూర్ కొమరవెల్లి, కె.శ్రీనివాస్ రావు బోడుప్పల్ జ్ఞాపకార్థం ఆయనభార్య చేన్నమ్మ, కొడుకులు, కోడండ్లు, మనుమండ్లు మనుమరాలు, వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. వివిధ గ్రామాల భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



పెద్దపల్లి , అక్టోబర్01(ప్రజా స్వరం): పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో చిట్యాల రాజయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.బుధవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు పరమార్శించి ఆర్థిక సాయం అందజేశారు.పరామర్శించిన వారిలో చిట్యాల సమ్మయ్య,పుల్లూరు శ్రీధర్,చిట్యాల సంతోష్,పులిగంటి శేఖర్,పొట్ల రమేష్ తదితరులు ఉన్నారు.

## అమ్మవారి దీవెనలు అందరిపై ఉండాలే



- **-దుర్గామాతను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ శైలజ దంపతులు.**

పెద్దపల్లి ,అక్టోబర్01(ప్రజా స్వరం): దుర్గామాత అమ్మవారి దీవెనలు,ఆశీస్సులు అందరిపై ఉండాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వేడుకున్నారు.దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మంథని పట్టణంలోని హనుమాన్ నగర్ లో ప్రతిష్ఠించిన దుర్గామాతను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ శైలజ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.నియోజకవర్గ ప్రజలు అమ్మవారి దీవెనలతో సంతోషంగా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ శైలజ దంపతులను సన్మానించారు.

# తల్లిని గుర్తు తెచ్చుకొని కన్నీరు పెట్టుకున్న డీజీపీ



**హైదరాబాద్, ప్రజాస్వరం:**
డీజీపీ జితేందర్ పదవీ విరమణ కార్యక్రమాన్ని తెలంగాణ పోలీసు అకాడమీలో ఘనంగా నిర్వహించారు. పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సైబర్ క్రైమ్, నార్కోటిక్స్‌పై కఠిన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. కొన్ని సమస్యలను మానవతా కోణంలో పరిష్కరించామని.. బాధితులకు అండగా ఉండేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని వివరించారు. ‘‘డీజీపీగా అవకాశం కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు. గత 15 నెలల్లో శాంతి భద్రతలను అదుపులోకి తీసుకువచ్చాం. రాష్ట్రవ్యాప్తంగా క్రైమ్ రేట్ తగ్గించడానికి అనేక చర్యలు చేపట్టాం. జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసుకు మంచి గుర్తింపు వచ్చింది. నార్కోటిక్స్, సైబర్ క్రైమ్‌లతో నిరంతరం యుద్ధం చేస్తున్నాం. బెట్టింగ్ మాఫియాపై లోతుగా దర్యాప్తు చేపట్టాం. దేశవ్యాప్తంగా అనేక చోట్ల సోదాలు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేశాం. ఇండియా జస్టిస్ రిపోర్ట్ ప్రకారం తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. నేరాల ఛేదనలో టెక్నాలజీ చాలా కీలకం’’ అని జితేందర్ అన్నారు.
ఉద్యోగ రీత్యా కుటుంబానికి, బంధువులకు దూరంగా ఉండాల్సి వచ్చిందని జితేందర్ పేర్కొన్నారు. తాను తల్లి, తండ్రి ఇద్దరినీ కోల్పోవడం చాలా బాధ కలిగించిందన్నారు. ఈ సందర్భంగా తన తల్లిని గుర్తు తెచ్చుకుని ఆయన కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ వీడ్కోలు కార్యక్రమానికి కొత్త డీజీపీ శివధర్ రెడ్డి, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# కరూర్ తొక్కిసలాటకు బాధ్యులెవరు..?



**హైదరాబాద్, ప్రజాస్వరం:**
తమిళనాడులోని కరూర్‌లో టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రచారసభ సందర్భంగా తొక్కిసలాట (Karur Stampede) జరిగిన ప్రాంతాన్ని హేమా మాలిని నేతృత్వంలోని భాజపా ఎంపీల బృందం పరిశీలించింది. బాధిత కుటుంబాలతో మాట్లాడిన ఈ బృందం.. విషాద ఘటనకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకుంది. స్టార్ హీరో ప్రచార సభకు ఇరుకైన ప్రాంతాన్ని ఎంపిక చేయడంపై విమర్శలు గుప్పించిన బృందం.. ఈ తొక్కిసలాటకు ‘బాధ్యులెవరు?’ అనేదే ప్రశ్న అని పేర్కొంది.
అనుమానాలు..! ‘‘తొక్కిసలాట ఘటన ప్రాంతాన్ని పరిశీలించాం. అసలేం జరిగిందనే విషయాన్ని బాధిత కుటుంబాలను అడిగి తెలుసుకున్నాం. ఏ రాజకీయ ప్రచార సభలోనూ ఇటువంటి తొక్కిసలాట సంభవించలేదు. స్టార్ హీరో సభకు ఇరుకైన సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయడం సరికాదు. బాధితులు ఇంకా కోలుకోలేదు. మెరుగైన వైద్యం అందుతోంది’’ అని హేమా మాలిని పేర్కొన్నారు. విశాల ప్రాంగణాన్ని కేటాయిస్తే ఈ విషాదం జరిగేది కాదన్న ఆమె.. ఇరుకైన వేదిక, కరెంటు కట్ చేయడం వంటివి అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇవి అసాధారణంగా కనిపిస్తున్నాయని హేమా మాలిని అభిప్రాయపడ్డారు. మరో ఎంపీ అనురాగ్ ఠాకుర్ మాట్లాడుతూ.. విజయ్ ప్రచార సభకు ఏర్పాట్లు చేయడంలో తమిళనాడు పోలీసులు నిర్లక్ష్యంగా వహించినట్లు కనిపిస్తోందన్నారు.
బాధిత కుటుంబాలను కలుస్తాం టీవీకే
త్వరలోనే బాధిత కుటుంబాలను కలుస్తామని టీవీకే నేత అధవ్ అర్జున వెల్లడించారు. ప్రస్తుతానికి ఎక్కువగా మాట్లాడలేనని, బాధిత కుటుంబాలతో కలిసి తమ సుదీర్ఘ ప్రయాణం కొనసాగుతుందన్నారు. ఇప్పటికే టీవీకే తరఫున బాధితులకు రూ.20లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించింది. ఈ తొక్కిసలాట ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

# హైదరాబాద్ సిటీ కొత్త సీపీగా వీసీ సజ్జనార్ బాధ్యతలు

- **శాంతి, భద్రత, ప్రజల రక్షణ పై దృష్టి : సీపీ సజ్జనార్**
- **సైబర్ మోసాలకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలి**

**హైదరాబాద్, ప్రజాస్వరం:**
హైదరాబాద్ నగరానికి కొత్త సిటీ పోలీస్ కమిషనర్‌గా (సీపీ) వీసీ సజ్జనార్ మంగళవారం (సెప్టెంబర్ 30) బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సిటీలో శాంతి భద్రత కాపాడటం మా ప్రధాన కర్తవ్యం అని, ప్రజల రక్షణ కోసం అన్ని చర్యలు చేపడతామని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణలో మరింత కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మాదకద్రవ్యాల ప్రభావాన్ని తగ్గించడం, యువతను రక్షించడం మా ముఖ్య లక్ష్యం అని పేర్కొన్నారు. సైబర్ నేరాల పై జాగ్రత్త తీసుకోవాలని సీపీ హెచ్చరించారు. ఎవరూ ఊరికే డబ్బు అడిగినవారిని నమ్మకూడదన్నారు. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ యాప్‌లు, పందా వ్యవహారాల ద్వారా ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. సైబర్ నేరాలపై కొత్త చర్యలు తీసుకుంటాం అని ఆయన చెప్పారు. అలాగే, ఆన్‌లైన్ బెట్టింగ్, ఫేక్ యాప్‌లపై పర్యవేక్షణ మరింత పెరగనుంది. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నాం అని, డ్యూటీలో ఉన్న పోలీసులను ప్రతి క్షణం అలెర్ట్‌గా ఉండమని ఆదేశించారు. చివరగా సిటీలో శాంతి భద్రతను కాపాడటం మా ప్రధాన బాధ్యత అని, ప్రతి ఒక్కరికి సురక్షితమైన వాతావరణాన్ని అందించడం మా కర్తవ్యం అని సీపీ సజ్జనార్ తెలిపారు.



# రికార్డు స్థాయిలో ఎం.సి.హెచ్ ఆసుపత్రిలో 250 ప్రసవాలు

- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**
- **మంచి వైద్య సేవలు అందిస్తున్న బృందానికి ప్రత్యేక అభినందనలు.**
- **పెద్దపల్లి ఎం.సి.హెచ్ పని తీరు పై పత్రికా ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్.**

**పెద్దపల్లి,అక్టోబర్01(ప్రజా స్వరం):**
సెప్టెంబర్ నెలలో పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని ఎం.సి.హెచ్ ఆసుపత్రిలో రికార్డు స్థాయిలో 250 ప్రసవాలు జరిగాయని,దీనికి కృషి చేసిన అధికారులను ప్రత్యేకంగా అభినందిస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.గతంలో ఎన్నడు సాధించని విధంగా సెప్టెంబర్ నెల జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల యందు కలుపుకొని 503 ప్రసూతులు నిర్వహించినందుకు గాను జిల్లా వైద్యాధికారి డాక్టర్ వాణిశ్రీ,డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్,సంబంధిత డాక్టర్లను,సిబ్బందిని క్షేత్రస్థాయి సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.జిల్లా ఆసుపత్రిలో గతంలో డెలివరీ లు సరాసరి 130 ఉండగా సెప్టెంబర్ నెలలో అత్యధికంగా అల్ టైం రికార్డు స్థాయిలో 250 డెలివరీ లు జరిగాయని ఈ సంవత్సరము లోనే ఏర్పాటు చేసిన నవజాత శిశు కేంద్రం ద్వారా 68 మంది నవజాత శిశువు లకు చికిత్స అందించడం జరిగిందని అన్నారు.గతంలో సరాసరి ఓపీ నెలకీ 12,500 ఉండగా గత సంవత్సర కాలంలో క్రమంగా పెరిగి ఈ నెల 26,730 కు చేరుకుందని,దీనిలో అధికంగా జనరల్ మెడిసిన్,జనరల్ సర్జరీ,పీడీయాట్రిక్స్,గైనాకలజీ,కంటికి సంబందించిన ఓపీ,చెవి ముక్కు గొంతు,డెంటల్ మరియు స్కిన్ ఓపీ లు రెట్టింపు కొన్ని విభాగల లో మూడు రేట్లు పెరిగాయని అన్నారు.గతంలో ఇన్ పేషెంట్ ఒక నెలకు సరాసరి 1100 ఉండగా ఈ సెప్టెంబర్ 2025 నెలలో 2300 మంది ఇన్ పేషెంట్ సర్వీస్ పొందారని,గతంలో ఆర్థోపెడిక్ సర్జరీలు సరాసరి నెలకు 9 మేజర్ 10 మైనర్ ఉండగా ఈ నెల 34 మేజర్ 27 మైనర్ శస్త్ర చికిత్సలు నిర్వహించడం జరిగింది. జనరల్ సర్జరీ గతంలో మేజర్ మరియు మైనర్ కలిపి 20 కాగా ఈ నెల 45 నిర్వహించారు. గతంలో కంటి శస్త్ర చికిత్సలు పెద్దపల్లి లో ఆపరేషన్ థియేటర్ లేనందున కంటి వైద్యులు పెద్దపల్లి జిల్లా పేషెంట్ లను కరీంనగర్ ఆసుపత్రి లో సర్జరీ చేసేవారు.ఈ సంఖ్య నెలకు 20 ఉండగా,నూతనంగా ఏర్పాటు చేసిన కంటి ఆపరేషన్ థియేటర్ వల్ల సెప్టెంబర్ 2025 గాను 229 కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు.గతంలో ఈ.ఎన్.టి,డెంటల్ సర్జరీ లు నిర్వహించే వాళ్ళు కాదని,గత నెల 15 ఈ.ఎన్.టి ప్రొసీజర్స్ మరియు 529 డెంటల్ ప్రొసీజర్స్ నిర్వహించారని,గతంలో రక్త పరీక్షలు నెలకు 15 వేలు సరాసరి చేసేవారని,నేడు ఆ సంఖ్య 31వేలకు పెరిగిందని,గతంలో స్కానింగ్ సేవలు సరాసరి నెలకు 800 ఉండగా ఈ నెల 1960 స్కానింగ్ సేవలు చేశారు.గతంలో టిఫ్ఫా స్కానింగులు,2 డి ఎకో సేవలు జరిగేవి కావని,నేడు సెప్టెంబర్ నెలలో 123 టిఫ్ఫా స్కానింగ్ లు,164 2డి ఎకో లు చేయడం జరిగిందని అన్నారు.గతంలో ఫిజియోథెరపీ సేవలు నెలకు 120 కాగా గత నెల 678 మందికి ఫిజియోథెరపీ సేవలు చేయడం జరిగింది.జిల్లాలో 5148 గర్భిణీ స్త్రీలను నమోదు చేయగా,అందులో 4,581 గర్భిణీలను మూడు నెలల లోపే నమోదు చేశారు.వీరందరికీ 100 శాతం నాలుగు గర్భిణీ పరీక్షలను ప్రభుత్వ ఆసుపత్రుల యందు నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వాస్త్ కార్యక్రమంలో 99882 విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు.సమగ్ర టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమములో 72,495 మందికి ఛాతి ఎక్స్ రే లు నిర్వహించారు.ఇందులో 1097 టి.బి. వ్యాధి గ్రస్తుల గుర్తించి చికిత్స అందించు చున్నారు.ఎన్. సి. డి. స్క్రీనింగ్ 416530 మందికి 95శాతం గా స్క్రీనింగ్ నిర్వహించారు.స్వస్థ్ నారి సశక్త్ పరివార అభియాన్ కార్యక్రమములో 104 శిబిరంలో నిర్వహించి 7634 మహిళలకు స్పెషలిస్ట్ డాక్టర్ ల చే పరీక్షలు నిర్వహించడం జరిగింది.అదనముగా 27210 మంది మహిళలకు ఆయుష్మాన్ మరియు బస్తీ దవాఖానల ద్వారా పరీక్షలు నిర్వహించడం జరిగింది అని అన్నారు.

# తిరుమలలో వైభవంగా సూర్యప్రభ వాహనసేవ





**హైదరాబాద్, ప్రజాస్వరం**
ప్రపంచ ప్రసిద్ధ తిరుమల తిరుపతి దేవస్థానంలో రీవేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిపూర్వకంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందిస్తూ, తిరుమల కొండను దివ్యమైన వాతావరణంతో నింపుతున్నాయి.

**సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుడు**
మంగళవారం ఉదయం శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సూర్యప్రభ వాహన సేవ అంగరంగ వైభవంగా జరిగింది. సూర్యప్రభ వాహనంపై శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమైన అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించేందుకు దేశ విదేశాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తిరుమల మాడవీధుల్లోకి తరలివచ్చారు. సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుడు భక్తులకు అభయప్రదానం చేస్తూ, వారి హృదయాలను ఆనందంతో నింపారు. వాహనసేవ సందర్భంగా మాడవీధులు భక్తుల జయ జయధ్వానాలతో, భక్తిగీతాలతో మార్మోగాయి.

**స్నపన తిరుమంజనం, చంద్రప్రభ వాహన సేవ**
అదే రోజు మధ్యాహ్నం 1 గంటకు శ్రీవారికి స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో శ్రీవారికి పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ఈ దివ్యమైన ఆచారం భక్తులకు ఆధ్యాత్మిక శాంతిని అందించింది. రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహన సేవ నిర్వహించనున్నారు. చంద్రప్రభ వాహనంపై శ్రీవేంకటేశ్వరస్వామి శోభాయమానంగా దర్శనమివ్వనున్నారు. ఈ సేవలో భాగంగా మాడవీధులు మరోసారి భక్తిమయ వాతావరణంతో నిండిపోనున్నాయి.

**భక్తుల సౌకర్యం కోసం ఏర్పాట్లు**
తిరుమల తిరుపతి దేవస్థానం బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా భద్రత, దర్శనం, వసతి, ఆహార సౌకర్యాలను సమర్థవంతంగా అందిస్తోంది. ఈ ఉత్సవాలను తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక రవాణా సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి.

**బ్రహ్మోత్సవాల విశిష్టత**
సాలకట్ల బ్రహ్మోత్సవాలు తిరుమలలో జరిగే అత్యంత ప్రధానమైన ఉత్సవాలలో ఒకటి. ఈ ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు వివిధ వాహన సేవలతో, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఘనంగా జరుగుతాయి. ప్రతి రోజూ శ్రీవారు ఒక్కో వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఉత్సవాలు భక్తులకు శ్రీవేంకటేశ్వరస్వామి యొక్క దివ్య దర్శనాన్ని అందిస్తూ, వారి జీవితాల్లో శాంతి, సమృద్ధిని ప్రసాదిస్తాయని భక్తుల విశ్వాసం.ఈ బ్రహ్మోత్సవాలు భక్తుల హృదయాలను ఆధ్యాత్మిక భావనతో నింపుతూ, తిరుమల కొండను దివ్య క్షేత్రంగా మరింత పవిత్రం చేస్తున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999